# ధైర్యలక్ష్మిగా జ్ఞానసరస్వతి అమ్మవారు



జ్ఞానసరస్వతి ఆలయంలో ధైర్యలక్ష్మి గా అమ్మవారు



ఆంజనేయస్వామి ఆలయంలో గాయత్రీదేవిగా..

ఇటిక్యాల, అక్టోబర్ 16: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం బీచుపల్లి క్షేత్రంలోని జ్ఞానసరస్వతి అమ్మవారు ధైర్యలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దినకరాచారి అమ్మవారికి అభిషేకం, తీర్థగోష్టి, ప్రసాద వితరణ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వెలిసిన అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో కొలువుదీరారు. అర్చకుడు సందీపాచారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి రామన్‌గౌడ్ పర్యవేక్షించారు.

## గాయత్రీదేవిగా..



వడ్డేపల్లి, అక్టోబర్ 16 : శాంతినగర్‌లో సోమవారం సహస్రార్జున క్షత్రియఖత్రి సమాజ్ వారి ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఉదయం పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దేవయ్య, కోశాధికారి నాగేశ్వర్‌రావు, యువజన అధ్యక్షుడు రమేశ్ కుమార్, కోశాధికారి శ్రీనివాసులు, నాగప్ప, నర్సప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజు ప్రత్యేక పూజలు

మానవపాడు, అక్టోబర్16: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం, అమరవాయిలోని శివాలయంలో అమ్మవారు సోమవారం రెండో రోజు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కిరణ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీకాంత్‌శర్మ భక్తులచే ప్రత్యేక పూజలు చేయించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

# బాలత్రిపురసు ందరిగా కాళికాదేవి

అయిజ, అక్టోబర్ 16: పట్టణంలోని అంబాభవాని, వాసవీ కన్యకాపరమేశ్వరి, కాళికాదేవి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రులు కనుల పండువగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం ఆలయంలో కొరువుదీరిన అమ్మవారికి అభిషేకం నిర్వహించి, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అంబాభవాని గాయత్రీ దేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరి అన్నపూర్ణేశ్వరిదేవిగా, కాళికాదేవి బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులున్నారు.



బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో కాళికాదేవి



గాయత్రీ దేవి అలంకరణలో అంబాభవాని

## సర్పంచ్ మృతి తీరనిలోటు



తిమ్మక్క మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

అయిజ, అక్టోబర్ 16: కుటుకనూర్ సర్పంచ్ తిమ్మక్క మృతి గ్రామానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డారు. సోమవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచనల మేరకు సర్పంచ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐదేళ్లలో గ్రామాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందించారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే సింగిల్‌విండో మాజీ చైర్మన్ రాముడు సర్పంచ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ ప్రహ్లాద రెడ్డి, రంగారెడ్డి, మహబూబ్ పాషా, మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, తిమ్మప్ప, తిమ్మన్న, ఎలియాజర్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీకి పదివేల మొక్కలు పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో గోవిందరావు

అలంపూర్, అక్టోబర్ 16: ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి పదివేల మొక్కలకు తగ్గకుండా పెంచాలని ఎంపీడీవో గోవిందరావు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న వారికి ప్రతిరోజూ 50మందికి తక్కువ కాకుండా పని కల్పించాలన్నారు. అక్టోబర్ 30వ తేదీ వరకు బ్యాగులను మట్టితో నింపి, విత్తనాలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

## హరినామ సంకీర్తనలో అలంపూర్ బృందం

అలంపూర్,అక్టోబర్ 16: దేవీ నవరాత్రుల సందర్భంగా తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనం ఆధ్యాత్మిక కార్యక్రమంలో బుక్కాపురం అభయాంజనేయ భజన బృందం 14మంది సభ్యులు పాల్గొన్నారు. ఏటా పాల్గొంచుకోవడం ఆనవాయితీ. వెళ్లిన వారిలో వెంకటస్వామిరెడ్డి, నారాయణరెడ్డి, మద్దిలేటి, భీముడు, కృష్ణగౌడ్, దేవేందర్ నాయుడు ఉన్నారు.

### సంకాపురం భజన మండలి..

అయిజ, అక్టోబర్ 16: మండలంలోని సంకాపురానికి చెందిన విజయరాయ భజన మండలి బృందం తిరుమలలో భక్తి కీర్తనలు ఆలపించి భక్తులు, టీటీడీ అధికారుల ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తిమ్మప్ప, నర్సింహాచారి, వెంకట్రాముడు, దేవర శ్రీను, చిన్న తిమ్మప్ప, రామలింగం, నర్సింహులు, కృష్ణ, రాముడు, రవి ఉన్నారు.

## మద్యం పట్టివేత : కేసు నమోదు

అలంపూర్, అక్టోబర్ 16: అలంపూర్ మండల కేంద్రం నుంచి ర్యాలంపాడుకు మద్యం తరలిస్తున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. పట్టణంలోని మద్యం దుకాణం నుంచి గ్రామంలోని బెల్ట్ దుకాణంలో మద్యం అమ్ముకునేందుకు బైక్‌పై తీసుకెళ్తుండగా అలంపూర్ ర్యాలంపాడు తుంగభద్రానది వంతెన వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. సుమారు రూ.80వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నామని, రవిగౌడ్, పవన్‌కళ్యాణ్‌తో పాటు బైక్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు.



పట్టుబడిన మద్యంతో పోలీసులు

# ప్రజలకు చేరువైన పీఏసీసీఎస్‌లు

అయిజ, అక్టోబర్ 16: రైతుల సేవలకే పరిమితమైన పీఏసీసీఎస్‌లు ప్రజావసరాలను తీర్చడంలోనూ ముందుంటున్నాయని డీసీసీబీ సీఈవో లక్ష్మయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను సీఈవో సందర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడాలేని విధంగా ప్రథమంగా అయిజలో సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేసి, ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను ఎంఆర్పీ ధరలకే అందించడం గర్వకారణమన్నారు. ఒక్కప్పుడు రైతులకు పంట రుణాలు, ధీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలకే పరిమితమైన పీఏసీసీఎస్‌లు రైతులతో పాటు ప్రజల అవసరాలను తీర్చడంలోనూ విజయవంతం అవుతున్నాయన్నారు. అయిజ పీఏసీసీఎస్‌లో ఇప్పటికే ఎరువులు, ఫర్టిలైజర్లు అందిస్తూ రైతుల అభిమానాన్ని చూరగొంటుందన్నారు. అన్నివర్గాల ప్రజలకు సరసమైన ధరలకే నాణ్యమైన నిత్యావసర సరుకులను అందించేందుకు నాబార్డ్ సహకారంతో సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. డీసీసీబీ సహకారంతో అయిజ సింగిల్‌విండోను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, బ్యాంక్ పీడీ సెల్ అధికారి అశోక్‌కుమార్, సీఈవో మల్లేశ్, సిబ్బంది సూర్యవర్ధన్‌రెడ్డి, భక్త ప్రహ్లాద, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పీఏసీసీఎస్ సూపర్ మార్కెట్‌ను సందర్శిస్తున్న డీసీసీబీ సీఈవో లక్ష్మయ్య

## హంస వాహనంపై విహరించిన శ్రీవారు

అయిజ, అక్టోబర్ 16: పట్టణానికి సమీపంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్ప (వేంకటేశ్వర)స్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శ్రీవారు హంస వాహనంపై విహరించి భక్తులను ఆశీర్వదించారు. సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవీ సమేత వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. బ్రహ్మ వాహనమైన హంస పరమహంసకు ప్రతీక. హంసకు ఒక ప్రత్యేకత ఉంది. పాలను, నీళ్లను వేరు చేస్తుంది. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలదని అర్థం. శ్రీవారు హంస వాహనాన్ని అధిరోహించి దర్శనమివ్వడం ద్వారా అహంభావాన్ని తొలగించి దాసోహభావాన్ని (శరణాగతి) కలిగిస్తాడని భక్తుల విశ్వాసం. భాజాభజంత్రీలు, మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణలు, చిన్నారుల కోలాటాల నడుమ శ్రీవారు హంసవాహనంపై ఊరేగారు. భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చి శ్రీవారి సేవను కనులారా చూసి తన్మయత్వం చెందారు. అలాగే మండలంలోని రాజాపురం గ్రామంలో స్వయంభూ గుంటి రంగనాథ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత గుంటి రంగనాథుడు పల్లకీలో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



హంసవాహనంపై విహరిస్తున్న శ్రీవారు